సాక్షి
వికారాబాద్

శుక్రవారం : 23 : మే : 2025



ఆ ఫ్యాక్టరీ మాకొద్దు

పర్యావరణానికి విఘాతం సృష్టించే పరిశ్రమలు తమకొద్దని మీర్జాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



విద్యా వ్యవస్థలో..

నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని విద్యాశాఖ రిసోర్స్‌పర్సన్లు అన్నారు. 8లో▸



సేంద్రియ సాగుపై అనాసక్తి!

సేంద్రియ ఎరువులపై అధికారులు ప్రచారం చేయకపోవడంతో వీటి వినియోగంపై రైతులు దృష్టి సారించడం లేదు. 9లో▸

మిల్లర్ల మాయాజాలం

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ
- బస్తాకు 42 కేజీలు ఉంటేనే అనుమతి
- లేదంటే వాహనాలు వాపస్
- నిస్సహాయ స్థితిలో కేంద్రాల నిర్వాహకులు
- కొరవడిన పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ
- ఆందోళనకు దిగిన రైతులు



కాశింపూర్ కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

బషీరాబాద్: ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు మాయాజాలం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు 42 కిలోల ధాన్యం ఉంటేనే దించుకుంటామని.. లేదంటే కొనుగోలు కేంద్రాలకు తిప్పి పంపుతామంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. దీంతో చేసేది లేక సెంటర్ల నిర్వాహకులు బస్తాకు అదనంగా రెండు కిలోల చొప్పున తూకం వేసి ధాన్యం సేకరిస్తున్నారు. దీనిపై రైతులు గురువారం కాశింపూర్, గొట్టిగకలాన్ కొనుగోలు కేంద్రంల్లో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శంకర్ కేంద్రానికి చేరుకుని రైతులను సముదాయించారు. తాము మిల్లర్ల సూచన మేరకు అదనంగా తూకం వేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వారం క్రితం 41.5 కిలోల చొప్పున పంపిన మూడు లారీలకు వెంకట పద్మావతి మిల్లు యజమాని ఇప్పటి వరకు అప్రూవల్ ఇవ్వలేదని వాపోయారు.

109 బ్యాగులకు 105 రాశారు

కాశింపూర్ కొనుగోలు కేంద్రం నుంచి ఈ నెల 10న రైతు పిట్టల మొగులప్ప 109 బ్యాగుల ధాన్యాన్ని బాలాజీ మిల్లుకు తరలించాడు. 4,430 కిలోల తూకం వచ్చింది. ఈ మొత్తానికి 42 కిలోల చొప్పుల లెక్కగట్టిన మిల్లు నిర్వాహకులు 105 బస్తాలకు బిల్లు చేయాలని ట్రక్కుషీట్‌పై రాసి సీసీ రాములుకు పంపిచినట్లు తెలిపారు.

42 కేజీలుంటేనే అన్‌లోడ్

మండల పరిధిలో కాశింపూర్‌లో, మైల్వార్, నావంద్గీ, నవల్గా, దామర్‌చెడ్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 వరకు చూసి రైతుల నుంచి బస్తాకు 40.6 కిలోల ధాన్యం తూకం వేయాలి. కానీ బస్తాకు 42 కేజీల చొప్పున తూకం వేస్తున్నారు. దీంతో రైతులు నిర్వాహకులను ప్రశ్నిస్తే మిల్లర్లు 42 కేజీలుంటేనే ధాన్యం తీసుకుంటున్నారని.. లేదంటే వాహనాలు తిప్పి పంపుతున్నారని చెబుతున్నారు. ఐదు రోజుల క్రితం మైల్వార్ కొనుగోలు కేంద్రం నుంచి వెంకట పద్మావతి మిల్లుకు 650 బస్తాలు పంపగా తేమ శాతం ఎక్కువగా ఉందని తిప్పి పంపారు. 15 శాతంగానే ఉందని సెంటర్ నిర్వాహకులు ప్రశ్నించడంతో అన్ని బస్తాలు 42 కిలోలు ఉంటేనే పంపాలని సూచించారు. తాము 68 శాతం బాయిల్ రైస్ ప్రభుత్వానికి ఇవ్వాలని తమకు గిట్టుబాటుకాక అదనంగా ఒక్కో బస్తాకు రెండు కిలోలు అదనంగా తీసుకుంటున్నామని చెబుతున్నారు. అధికారులకు విషయం తెలిసినప్పటికీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదనే విమర్శలు వస్తున్నాయి.

మిల్లర్లకు అదనంగా 420 క్వింటాళ్ల ధాన్యం

మండల పరిధిలోని ఐదు కొనుగోలు కేంద్రాల నుంచి అగ్గనూరు సమీపంలోని వెంకట పద్మావతి, లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలోని బాలాజీ మిల్లుకు ధాన్యం తరలిస్తున్నారు. ఇప్పటి వరకు మండలం నుంచి 30 వేలకు పైగా ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించారు. వెంకట పద్మావతి మిల్లుకు పంపిన 20,500 బస్తాలన్నీ 42 కిలోల చొప్పున తూకం వేసినట్లుగా కేంద్రం నిర్వాహకులు ప్రకటించారు. బాలాజీ రైస్ మిల్లుకు పదివేల బస్తాల వరకు పంపించారు. రైతుల నుంచి బస్తా తూకం తీయగా 420 క్వింటాళ్ల ధాన్యం అదనంగా మిల్లర్లకు లాభం చేకూరింది. ఈ ధాన్యం విలువ రూ.9,74,400 ఉంటుందని అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

కష్టాన్ని కాజేస్తున్నారు

తాలు పేరిట ఒక్కో బస్తాకు 42.50 కిలోల చొప్పున తూకం వేశారు. 200 బస్తాలకు 2.50కిలోల చొప్పున నా కష్టాన్ని మిల్లర్లు దోచుకున్నారు. సుమారు మూడు క్వింటాళ్ల వరకు నష్టపోయినా. మిల్లర్లు చెప్పినట్లు తూకాలు వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– విశ్వనాథ్‌రెడ్డి, రైతు, గొట్టిగకలాన్

ప్రభుత్వం న్యాయం చేయాలి

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని ప్రభుత్వం అరికట్టాలి. బస్తాకు 40.60 కిలోలు తూకం వేయాలి. తాము శ్రమించి పండించిన పంటను ఇష్టారాజ్యంగా తూకాలు వేసి దోచుకుంటున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలి. వర్షాలకు ధాన్యం తడిస్తే ఆరబెట్టడానికి తీవ్రంగా కష్టపడుతున్నాం. వెంటవెంటనే తూకాలు వేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, రైతు, గొట్టిగకలాన్

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రేడ్–1 దొడ్డు రకం వరి ధాన్యాన్ని రూ.2,320 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాం. బస్తాకు 40.60 కిలోలు మాత్రమే తూకం వేయాలి. అంతకంటే ఎక్కువ వేయడానికి వీలులేదు. సన్నరకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. బషీరాబాద్‌లో ఎక్కువ తూకం వేస్తున్నట్లు ఫోన్‌లు వస్తున్నాయి. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

- అందుబాటులో 12 లక్షల గన్నీ సంచులు
- చివరి గింజ వరకూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం
- ఇప్పటి వరకు 44 వేల మెట్రిక్ టన్నుల సేకరణ
- 40 వేల మెట్రిక్ టన్నులకు ఆన్‌లైన్ ప్రక్రియ
- రైతుల ఖాతాల్లో రూ.64.55 కోట్ల నగదు జమ
- 'సాక్షి'తో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



లింగ్యానాయక్ , అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)

వికారాబాద్: ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్ అన్నారు. కొనుగోలుకు ఏర్పాటు చేసిన కేంద్రాలు, అందుబాటులో ఉన్న గన్నీ సంచులు, మౌలిక వసతులు, మిల్లులకు తరలింపు, ఆన్‌లైన్ ప్రక్రియ, రైతుల ఖాతాలో నగదు జమ, చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలను ఆయన 'సాక్షి'కి వివరించారు. సమస్యలు ఉంటే 1967/18004250033 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

ప్రశ్న: గన్నీ సంచుల కొరత ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు వాస్తవమేనా?

జవాబు: గన్నీ సంచులు అవసరమైన వాటి కంటే ఎక్కువే అందుబాటులో ఉంచాం. జిల్లా వ్యాప్తంగా 85 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 18 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాం. ఇప్పటి వరకు 10 లక్షల సంచుల్లో ధాన్యం సేకరించాం. కేంద్రాల్లో మరో 12 లక్షలున్నాయి. తేమ శాతం పరిశీలించాకే రైతులకు సంచులిస్తున్నాం.

ప్రశ్న: రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడంలో జాప్యం ఎందుకు?

జవాబు: కొనుగోలు చేసిన వారంలోపే నగదు జమ చేస్తున్నాం. ధాన్యం సేకరణ తర్వాత ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి మిల్లులకు తరలించేందుకు మూడు నుంచి వారం రోజుల సమయం పడుతుంది. ఇప్పటి వరకు 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా.. 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.64.55 కోట్లు జమ చేశాం. గతేడాది 50 వేల మెట్రిక్ టన్నులు సేకరించగా.. ఈసారి 80 వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం.

ప్రశ్న: ట్రాన్స్‌పోర్టు ఆలస్యమవుతుందని సెంటర్ల నిర్వాహకులు పేర్కొంటున్నారు?

జవాబు: అకాల వర్షాల కారణంగా ధాన్యం తడుస్తుంది. దీంతో తడిసిన ధాన్యం ముందుగా బాయిల్డ్ మిల్లులకు తరలించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మిగిలిన ధాన్యం తరలింపులో కొంత సమయం పడుతుంది. మిల్లుల్లో ధాన్యం నిల్వలు పెరగడంతో ఒక్కో లారీ అన్‌లోడ్‌కు గంటన్నర సమయం పడుతుంది. ఇది కూడా ఒక కారణం. చివరి గింజ కొనే వరకు కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తాం. జిల్లా రైతులు కల్టివేషన్ నెలకు పైగా ఆలస్యంగా చేస్తురు. దీంతో వర్షాలు ప్రారంభమయ్యాక కూడా ధాన్యం సేకరించాల్సి రావడం అసౌకర్యం కలిగిస్తుంది.

ప్రశ్న: సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కర్ణాటకతో పోలిస్తే మన రాష్ట్రంలో రూ.300–రూ.400 వరకు ఎక్కువ ధర చెల్లిస్తున్నాం. దీంతో అక్కడ నుంచి ధాన్యం వచ్చే అవకాశం ఉందని గుర్తించి సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. సెంటర్ల నిర్వహణ ప్రక్రియలో భాగస్వాములుగా ఉన్న అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ.. కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

న్యూస్‌రీల్

29న మెగా జాబ్ మేళా

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పట్టణంలో ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని వినాయక కన్వెన్షన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 50 ప్రైవేట్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని.. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఆర్టీసీ ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

పూడూరు: సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలతను కోరారు. ఈ మేరకు వారు గురువారం సంఘం జిల్లా రీజినల్ సెక్రెటరీ అబ్దుల్ జబ్బార్‌తో కలిసి ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన చాలా మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్‌లు అందలేవని వివరించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు సంబంధించి లీవ్స్ సరెండర్ డబ్బులు ఇప్పించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల వివరాలు హెల్త్‌కార్డులో నమోదు కొరకు తాండూరు, పరిగి , వికారాబాద్ డిపోలకు సంబంధించి వికారాబాద్‌లో నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సిద్దిఖీ, ఉపాధ్యక్షుడు ఎంకే రెడ్డి, వీరన్న, సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

కొడంగల్ రూరల్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేసేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని పర్సాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు ధాన్యం ఆరబెట్టిన తర్వాతే కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. నిర్వాహకులను అడిగి సేకరించిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ శంకర్‌రాథోడ్, మండల వ్యవసాయాధికారి జి.తులసి, ఏఈఓలు అశ్విని, సెంటర్ ఇన్‌చార్జిలు రైతులు ఉన్నారు.

సోలార్ టెక్నీషియన్లకు పెరగనున్న ఉపాధి

పీపుల్ ట్రీ ఫౌండేషన్ సౌత్ ఇండియా డైరెక్టర్ సంపత్



సర్టిఫికెట్లు అందజేస్తున్న సంపత్

తాండూరు టౌన్: భవిష్యత్‌లో పర్యావరణ పరిరక్షణకు సోలార్ విద్యుత్ వ్యవస్థ విస్తరించనుందని పీపుల్ ట్రీ ఫౌండేషన్ సౌత్ ఇండియా డైరెక్టర్ సంపత్ అన్నారు. రెండు నెలలుగా సెంబ్ కార్ప్ కంపెనీ, పీపుల్ ట్రీ ఫౌండేషన్ సహకారంతో పట్టణంలో ఏఎస్ కంప్యూటర్ సెంటర్‌లో సోలార్ టెక్నీషియన్ కోర్సులో 200 మందికి ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. విద్యుత్ వాడకం పెరగడంతో ఉత్పత్తి రేటు పెరుగుతోందన్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భవిష్యత్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరగనుందన్నారు. ఇందుకు సోలార్ టెక్నీషియన్ల అవసరం ఉంటుందన్నారు. ఉచిత శిక్షణతో విద్యార్థులు ఉపాధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్ ట్రీ ఫౌండేషన్ ఇన్‌చార్జి సురేశ్, ఏఎస్ కంప్యూటర్స్ డైరెక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

25న గ్రామ పాలన అధికారుల పరీక్ష

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: గ్రామ పాలన అధికారుల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. పరీక్ష సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 25న వికారాబాద్ జెడ్పీహెచ్‌ఎస్(బాలుర)లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష ఉంటుందని.. అభ్యర్థులు గంట ముందే రావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వాసుచంద్ర, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఏఓ పర్హీనాబేగం, సూపరింటెండెంట్ నేమత్ హాలీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఈడీఎం మహమూద్ పాల్గొన్నారు.

బియ్యం ఎఫ్‌సీఐకి పంపాలి



వెంకటసాయి రైస్‌మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి పంపించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని వెంకటసాయి రైస్‌మిల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే కొలతలు వాడాలని సూచించారు. రైతుల వద్ద తరుగు రూపంలో ఎక్కువ మొత్తంలో ధాన్యం సేకరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లులో అన్‌లోడ్ చేసి వెంటనే లారీలను తిప్పి పంపాలన్నారు. సెంటర్లలో రైతులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షంతో ధాన్యం తడవకుండా రైతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిగి ఏఎంసీ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేసి చైర్మన్‌ను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం మార్కెట్ గోడౌన్‌లలో నిల్వ చేయాలని అధికారులకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని చైర్మన్‌కు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఏసీఎస్ఓ టోక్యా నాయక్, తహసీల్దార్ ఆనంద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ..

బొంరాస్‌పేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఉండొద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి బొంరాస్‌పేట మండల కేంద్రం, మెట్లకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించేందుకు ఎప్పుడికప్పుడు లారీలు పంపుతామన్నారు.

80 వేల మెట్రిక్ టన్నుల అంచనా

జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నట్లు అంచనా వేస్తున్నామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. జిల్లాలో 36 వేల మెట్రిక్ టన్నుల వరకే సామర్థ్యమున్న మిల్లులున్నాయని తెలిపారు. వేరే జిల్లాల నుంచి లారీలను ఏర్పాటు చేశామన్నారు. ఓపీఎంఎస్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పద్మావతి, ఐకేపీ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులున్నారు.



సమన్వయ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి

జిల్లాలో తొలిసారి 'బాల అదాలత్'

- సమన్వయంతో విజయవంతం చేయాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతాదయాకర్‌రెడ్డి

అనంతగిరి: బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ.. వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో జూన్ మూడో వారంలో బాల అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బాల అదాలత్‌పై మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతాదయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బాలల సమస్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు రెవెన్యూ, పోలీస్, విద్య, ఆరోగ్య, వెల్ఫేర్ తదితర అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న బాల అదాలత్‌పై సమగ్రంగా వివరించి.. అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా నమోదవుతున్నాయని.. నివారణకు కార్యాచరణ, బాల్యవివాహ రహిత గ్రామాలు తీర్చిదిద్దేందుకు బాలల పరిరక్షణ కమిటీలు బలోపేతం చేయాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఐసీడీఎస్, బాలల పరిరక్షణ విభాగం సేవలపై జిల్లా సంక్షేమాధికారి జయసుధ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనాథ పిల్లలకు ఆరోగ్య శ్రీ కార్డులు వచ్చేలా చూడాలని కమిషన్ సభ్యులు అపర్ణ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరారు.

పైలెట్ ప్రాజెక్టుగా బొంరాస్‌పేట: కలెక్టర్

అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. బాల అదాలత్ కార్యక్రమ నిర్వాహణకు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ గురించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేశం కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కేంద్రంలోని శిశు గృహాన్ని సందర్శించిన కమిషన్ సభ్యులు వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు చందన, సరిత, వచన్ కుమార్, వందన గౌడ్, ప్రేమలత అగర్వాల్, అదనపు కలెక్టర్ సుధీర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా బాల పరిరక్షణ విభాగం అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, సఖి, భరోసా సిబ్బంది, బీఆర్‌బీ కోఆర్డినేటర్ , సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

'కేజీబీవీ'ని పరిశీలించిన ఎన్‌సీఆర్‌టీ బృందం



సందర్శించిన రాష్ట్ర బృందం

అనంతగిరి: వికారాబాద్‌లో ఉపాధ్యాయులకు కొనసాగుతున్న కెపాసిటీ బిల్డింగ్ ట్రెనింగ్‌ను గురువారం రాష్ట్ర ఎస్‌సీఆర్‌టీ నుంచి రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌లు డాక్టర్ ఎస్‌డీ మతీన్‌అహ్మద్, కవిత అగర్వాల్ సందర్శించారు. కేజీబీవీలో జరిగిన హిందీ శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారివెంట ఎంఈఓ బాబుసింగ్, పలువురు రిసోర్స్ పర్సన్‌లు, తదితరులు ఉన్నారు.

అర్హులకే రాజీవ్ యువ వికాసం

- సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక
- తాండూరు మండలానికి 800 యూనిట్లు మంజూరు

ఆర్‌వైవీ వివరాలు

బీసీ	293
ఈబీసీ	101
ఎస్సీ	265
ఎస్టీ	71
మైనార్టీ	66
క్రిస్టియన్ మైనార్టీ	04

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంలో రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మండల పరిధిలో ఈ పథకం కోసం 2,210 దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. ఈ దరఖాస్తు దారుల సిబిల్ స్కోర్ పరిశీలించేందుకు ఎంపీడీఓ కార్యాలయం నుంచి బ్యాంకు అధికారులకు పంపిచినట్లు విశ్వప్రసాద్ తెలిపారు. దరఖాస్తుదారులు గతంలో రుణాలు తీసుకున్నారా? తీసుకున్న రుణాలు చెల్లించకుండా దాటవేశారా అన్న కోణంలో అధికారులు కుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం నుంచి ఓ ఫార్మాట్ బ్యాంకు అధికారులకు చేరుకుంది. ఆఫార్మాట్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి సంబంధించిన వివరాలు అధికారులకు నివేదిస్తారు. తదనంతరం లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. మండలానికి 800 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

క్లుప్తంగా

పుష్ప వికాస'మే'



పెరట్లో పూసిన మే పుష్పం

ధారూరు: మండల కేంద్రంలోని మహ్మద్ బాబాఖాన్ ఇంటి పెరట్లో గురువారం మే పుష్పం వికసించింది. ఎరుపు రంగులో ఆకట్టుకుంటున్న ఈ పువ్వు పన్నెండు రోజుల పాటు అందరికీ కనువిందు చేస్తుందని, ఆతర్వాత రాలిపోతుందని ఖాన్ తెలిపారు.

మద్దతు ధరకు తెల్లజొన్న కొనుగోళ్లు



జొన్నలను లోడ్ చేస్తున్న హమాలీలు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరకు తెల్లజొన్నలు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.3,371 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తున్నారు. మోమిన్‌పేట కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 82 మంది నుంచి 2,005 క్వింటాళ్ల దిగుబడులను కొనుగోలు చేశామని సీఈఓ శేఖర్ తెలిపారు. రైతుల వద్ద భారీగా నిల్వలు ఉన్నాయని, వీటి సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. తేమ శాతం పరిశీలించి, ఏఈఓల వద్ద టోకెన్ తీసుకున్న వారి నుంచి వెంటనే జొన్నలు తీసుకుంటామని చెప్పారు.

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతగిరి: భాగ్యరెడ్డివర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి, దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ జిల్లా అభివృద్ధి శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గేటులో ఇరుక్కున్న జింక మృతి



జింకకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

కుల్కచర్ల: జనావాసాల్లోకి వచ్చి గేటులో తల ఇరుక్కున్న ఘటనలో గాయపడిన జింక గురువారం మృతిచెందింది. బుధవారం చౌడాపూర్ మండలం మరికల్ శివారులోని రామాలయం వద్ద ఓ ప్రైవేటు స్థలానికి ఏర్పాటు చేసిన గేటులో ఇరుక్కుపోయిన జింకను గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు సిబ్బంది అక్కడికి చేరుకుని జింకను మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి పార్కుకు తరలించారు. గేటులో తల ఇరుక్కోవడంతో మెడ నరాలకు తీవ్రంగా గాయాలై జింక మృతిచెందింది. గురువారం కళేబరాన్ని చౌడాపూర్ పశువైద్యశాలకు తీసుకువచ్చి, పశువైద్యుడు హతీరాం ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేశారు. నరాలు తెగడంతోనే మృతి చెందిందని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. 9389214214 [H-783416]

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [H-783415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆ ఫ్యాక్టరీ మాకొద్దు



ఫ్యాక్టరీ వద్ద పర్యావరణవేత్తలతో తమ గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు

- పరిశ్రమ విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా
- పర్యావరణానికి హాని కలిగిస్తుందని మీర్జాపూర్ రైతుల ఆందోళన
- పంట పొలాల నుంచి తొలగించాలని విజ్ఞప్తి

పూడూరు: పర్యావరణానికి విఘాతం సృష్టించే పరిశ్రమలు తమకొద్దని మండలంలోని మీర్జాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలోని 17 సర్వే నంబర్‌లో సుందర్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట లామినేట్ షీట్‌ల తయారీ ఫ్యాక్టరీ విస్తరణకు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ అధికారులు చేపట్టారు. అనివార్య కారణాల వల్ల కార్యక్రమం వాయిదా పడింది. అప్పటికే చేరుకున్న రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణవేత్తలు, అధికారులతో వాదనకు దిగారు. ఫ్యాక్టరీ విస్తరిస్తే దాని నుంచి వెలువడే దుర్వాసన, కాలుష్యంతో ఇబ్బంది పడతామని పేర్కొన్నారు. పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళనకు చేపట్టారు. పత్తి, జొన్న, వరి, పూల రైతులు తీవ్రంగా నష్టపోయామని ఫ్యాక్టరీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వెలువడే పొగతో పంటలు దుమ్ము బారిపోతున్నాయని చెప్పారు. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వదలడంతో బావులు, బోర్లలో నీరు రంగు మారుతుందన్నారు. వాసనతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు.

యాజమాన్యం బెదిరింపులు



పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే దుమ్ము ధూళి పడి దెబ్బ తింటున్నాయి. ఓ వైపు ఎర్ర మట్టి లారీలు, మరోవైపు లామినేట్ ఫ్యాక్టరీతో ఇబ్బందులు తప్పడం లేదు. రైతుల ఆరోగ్యాలు దెబ్బతినడంతో పాటు కెమికల్ వాసనతో కళ్లు కనిపించడం లేదు. ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పరిశ్రమ యాజమాన్యం బెదిరిస్తోంది.

– రాజు, రైతు, మీర్జాపూర్

అన్నీ ఇబ్బందులే..



మా పొలాల మధ్యన ఫ్యాక్టరీ వేశారు. మొదట్లో వ్యతిరేకించాం. పరపతితో అనుమతులు తెచ్చుకుని నడుపుతున్నారు. నాకున్న 5 ఎకరాల్లో ఎర్రనువ్వులు సాగు చేశాను. పరిశ్రమ నుంచి వచ్చే నల్లని పొగ పంటపై పడి పూర్తిగా దెబ్బతింది. ఇదేమని అడిగితే పట్టించుకోవడం లేదు. పంట పొలాల నుంచి కర్మాగారాన్ని వెంటనే తొలగించాలి.

– శివరాములు, రైతు, మీర్జాపూర్

పరిశ్రమను తొలగించాలి



రెండు ఎకరాల్లో జొన్న, చామంతి సాగు చేశారు. ఫ్యాక్టరీ వాసన వల్ల పొలాల్లో ఉండలేకపోతున్నాం. పొగ పూలపై పడి నిండుగా విచ్చుకోవడం లేదు. అధికారులు రైతులకు హాని కల్గించే పరిశ్రమలకు సునాయాసంగా అనుమతులు ఎలా ఇస్తారు? జిల్లా స్థాయి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

– శేఖర్, రైతు, మీర్జాపూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



లామినేట్ ఫ్యాక్టరీ పంట పొలాల నుంచి తొలగించాలని రైతులు కోరుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఉందని పరిశ్రమ వద్దకు వెళ్లాం. ఫ్యాక్టరీ విస్తరణను కర్షకులు వ్యతిరేకిస్తున్నారు. పంటలు దెబ్బతినడంతో పాటు ఆరోగ్యాలు పాడవుతాయని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ రాకపోవడంతో వాయిదా వేశాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– భరత్‌గౌడ్, తహసీల్దార్, పూడూరు

విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులు కీలకం



దోమ: సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ పరిశీలకులు నాగరాజు, నర్సింహరాజు

- జిల్లా పరిశీలకులు నాగరాజు, నర్సింహరాజు
- బోధనకు సాంకేతికతను జోడించాలని పిలుపు

పరిగి: నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదం చేస్తాయని విద్యాశాఖ జిల్లా రిసోర్స్‌పర్సన్లు నాగరాజు, నర్సింహారాజు అన్నారు. పరిగిలోని నంబర్ వన్ పాఠశాలలో ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ తరగతులను గురువారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకోవాలని సూచించారు. టీచింగ్‌లో సాంకేతికతను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల మెరుగునకే శిక్షణ

దోమ: విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకమని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఆ శాఖ జిల్లా పరిశీలకులు నాగరాజు, నర్సింహారాజు అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా దోమ కస్తూర్బా గాంధీ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితం, సైన్స్ బోధనపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా ఇతర అంశాలను బోధించాలని తెలిపారు. పాఠ్యాంశాల బోధనకు సాంకేతికతను జోడించాలని, ఐసీటీ, దీక్షాయాప్ తదితర నూతన మార్పులను ఆకళింపు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్, మండల రిసోర్స్ పర్సన్లు వెంకటచారి, శ్రీనివాస్, మోహనాచారి, శ్రీనివాస్, రవి, సతీష్, రాకేష్, ఉపాధ్యాయులు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిగి: శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్లు

చినుకు పడితే చిత్తడే!



అడాల్‌పూర్ రోడ్డుపై గుంతల్లో నిలిచిన వరదనీరు

అధ్వానంగా అడాల్‌పూర్ రోడ్డు

- అవస్థలు పడుతున్న వాహనదారులు, గ్రామస్తులు

యాలాల: అధ్వాన రోడ్లతో మండలవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి అడాల్‌పూర్ రోడ్డు చిత్తడిగా మారింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు పాట్లు పడుతున్నారు. గ్రామానికి బీటీ రోడ్డు విషయమై ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని అడాల్‌పూర్ గ్రామానికి వెళ్లేందుకు తాండూరు మండలంలోని బిజ్వార్ సరిహద్దు నుంచి మెటల్‌రోడ్డు ఉంది. సుమారు 4 కిలోమీటర్ల ఉన్న రోడ్డు కంకరతేలి దారుణంగా మారింది. దీనికితోడు చిన్నపాటి చినుకులకు రోడ్డంత బురదమయంగా మారి ప్రమాదకరంగా మారుతుంది. ఈ సమయంలో ద్విచక్రవాహనదారులు రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఈ రోడ్డును బీటీగా మార్చేందుకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టరు పనులు చేపట్టకపోవడంతో అలాగే ఉండిపోయింది. నిత్యం ఇదే మార్గంలో అడాల్‌పూర్‌వాసులు తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు, వ్యాపారస్తులు, విద్యార్థులు అనునిత్యం ప్రయాణించే ఈ దారి విషయంలో పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి బీటీ రోడ్డు సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



బాధితుడికి ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ గిరి

యాలాల: ఇటీవల పలువురు వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు గురువారం బాధితులకు అందజేశారు. యాలాల ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఉసేనప్ప, కొత్లాపూర్‌కు చెందిన మహేశ్, రెడ్డిఘణపూర్‌కు చెందిన ప్రశాంత్, దౌలాపూర్‌కు చెందిన జాఫర్ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ విషయమై పీఎస్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ల లొకేషన్లతో గుర్తించినట్లు తెలిపారు.

బస్సు ఢీకొని ఆవు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన ఆవు

దోమ: ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన దోమ మండల పరిధిలోని బాస్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. బాస్‌పల్లి సమీపంలో పరిగి– మహబూబ్‌నగర్ రోడ్డును దాటుతున్న ఆవును వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు బస్సును పీఎస్‌కు తరలించారు. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు ఆంజనేయులు తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా



అనంతగిరి చివరిగుట్ట రోడ్డు మలుపులో బోల్తాపడిన కలప లారీ

ధారూరు: అనంతగిరిగుట్ట దిగిన ఓ లారీ రోడ్డు మలుపులో అదుపుతప్పి బోల్తాపడింది. గురువారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. వీరిని వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. కేరెళ్లి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ09వి 8752 నంబర్ లారీ ఎల్‌బీనగర్ నుంచి మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు సమీపంలోని టెక్స్‌టైల్ ఫ్యాక్టరీకి వెళ్తోంది. అనంతగిరి చివరి గుట్ట దిగుతూ మలుపు వద్ద అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు

- సైకిల్ అదుపు తప్పడంతో ప్రమాదం
- పాంబండ గుట్ట వద్ద ఘటన



శివకుమార్



మహేశ్ బాబు



సాయిచరణ్

కుల్కచర్ల: చిన్నారుల ఆటవిడుపు వారిని తీవ్ర గాయాల పాలుచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీరంపల్లికి చెందిన మహేశ్‌బాబు(10), సాయిచరణ్(10), శివకుమార్(13) గురువారం సైకిల్‌పై పాంబండ దేవస్థానానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో గుట్టపై నుంచి కిందికి దిగుతున్న క్రమంలో వేగంగా దూసుకెళ్తూ రోడ్డు పక్కన పడిపోయారు. ఈ ఘటనలో శివకుమార్‌కు రెండు చేతులు విరగగా, మహేశ్, సాయిచరణ్‌కు సైతం ఒక్కో చేయి విరిగింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా ముగ్గురినీ మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మందుబాబులకు అడ్డాగా బడి



ప్రహరీ లేని ఈర్లపల్లి పాఠశాల



పాఠశాల స్లాబ్‌పై పడేసిన మద్యం సీసాలు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డగా మారింది. వేసవి సెలవులు కావడంతో పాఠశాలలో పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో తాగుబోతులు దర్జాగా పాఠశాలలోనే మద్యం తాగి సీసాలను ఆవరణలోనే పడేస్తున్నారని గ్రామస్తులు, విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో ప్రతి రోజు చీకటి పడిందంటే చాలు మందుబాబులు అక్కడికే మద్యం తాగడానికి వస్తున్నారు. కొద్ది రోజుల్లోనే బడులు పునఃప్రారంభం అవుతాయని, ప్రభుత్వం వెంటనే పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తే రక్షణ ఉంటుందని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సులేమాన్ (ఫైల్)

అత్తాపూర్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నౌ నెంబర్ ప్రాంతానికి చెందిన సులేమాన్(28) ఆటో డ్రైవర్. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుల్కచర్లలో తిరంగా యాత్ర



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత మహిళల సిందూరాన్ని తుడిచేసిన ఉగ్రమూకలకు ఆపరేషన్ సిందూర్‌తో తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, భీంరెడ్డి, బీజేపీ మండల అ.ధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి హన్మంతు, దిశ కమిటీ సభ్యులు జానకిరాం చౌహాన్ , చౌడాపూర్ మండల అధ్యక్షు డు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కేశవులు, మైపాల్, కొండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు



హంసంపల్లిలో వృథాగా మారిన నీటి తొట్టి

దుద్యాల్: మండల పరిధిలోని హంసంపల్లి గ్రామంలో పశువుల నీటి తొట్టి నిరుపయోగంగా మారింది. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గతంలో ఇక్కడ రెండు తొట్లు నిర్మించారు. వీటిలో నీళ్లు నింపకపోవడంతో ప్రస్తుతం వృథాగా ఉన్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పుష్పలతను అడగగా.. రెండు తొట్లలో నీళ్లు నింపే ప్రయత్నం చేసినా లీకేజీలు ఏర్పడటంతో నిల్వ ఉండటం లేదని తెలిపారు. నిధుల కొరతతో మరమ్మతులు చేయలేకపోతున్నామని స్పష్టంచేశారు.

పచ్చదనంపై గొడ్డలివేటు



చెట్టు మొదలు నరికివేత

బషీరాబాద్: హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పెంచిన పచ్చని పూల చెట్లపై గొడ్డలి వేటు పడింది. ప్రభుత్వం అటవీశాఖ ద్వారా రూ.లక్షలు ఖర్చుపెట్టి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే చెట్లుగా మారాయి. అయితే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ లైన్ తీగలకు చెట్ల కొనలు తాకుతాయన్న సాకుతో ఏకంగా పెద్దపెద్ద వృక్షాలను మొదళ్లతో నరికివేశారు. ఈ ఘటన బషీరాబాద్ మండలం నీళ్లపల్లి శివారులోని మైల్వార్ ప్రధాన రోడ్డులో గురువారం వెలుగు చూసింది. రోడ్డుకు ఓ పక్కన ఉన్న సుమారు 12 గుల్‌మోహర్ చెట్లు అందమైన పువ్వులతో దారి పొడవునా వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండేవి. అయితే చెట్లకు పక్కనే విద్యుత్ లైన్ ఉండడంతో బషీరాబాద్ ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెట్ల మొదళ్లనే నరికివేయించారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం



మల్లయ్య మృతదేహం

పూడూరు: ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య(43) ఐదేళ్లుగా సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. వ్యాధి తీవ్రత అధికమవ్వడంతో భరించలేక బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించేందుకు గదిలోకి వెళ్లారు. కొద్దిసేపటికే చీరతో దూలానికి ఉరేసుకుని మృతి చెందారు. మృతుడి భార్య చాకలి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ కగార్‌పై విచారణ చేపట్టాలి



జనసేవా దళ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: నక్సలైట్ల ఏరివేతనే లక్ష్యంగా చేసుకొని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌పై వెంటనే సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఈ నెల 26 నుంచి 31 వరకు నిర్వహించే జనసేవా దళ్ శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆయన రాష్ట్ర నాయకులు పర్వతాలు, కే. రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సలైట్ల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం పని చేస్తుందే తప్పా, వారితో చర్చలు చేయడానికి అడుగులు వేయకపోవడం బాధాకరమన్నారు. చేవెళ్లలో జరిగే జనసేవా దళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని, ఈ జనసేవా సైనికులు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, వివిధ సేవా పనులు చేయడానికి కృషి చేయనున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ నాయకులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.